ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగష్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

రాత్రి 12 వరకు బార్లు..

- జిల్లాలో 26 బార్లకు గజిట్ నోటిఫికేషన్
- ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చెయ్యొచ్చు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఉప కమిషనర్ కె.హేమంత్ నాగరాజు, జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆయేషాబేగం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నూతన బార్ పాలసీ ద్వారా బార్‌లు తెరిచి ఉంచే సమయాన్ని అదనంగా 3 గంటలు పొడిగించి.. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు నడుపుకునేందుకు ప్రభుత్వం సడలింపు చేసిందని ఎక్సైజ్ ఉప కమిషనర్ కె.హేమంత్ నాగరాజు తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో 26 బార్లకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బార్ పాలసీ 2025-28ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో జనాభా ప్రతిపాదికన ఓపెన్ కేటగిరీలో 26 బార్లు కేటాయించామన్నారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 16, మార్కాపురం మున్సిపాలిటీ ▶ 2లో

ఖరీఫ్ గల్లంతు..



- ఇప్పటికీ 20 శాతమే సాగు..
- నెలాఖరుతో ముగియనున్న గడువు
- రూ.వెయ్యి కోట్లకుపైగా పంట ఉత్పత్తులు చేజారినట్లే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఖరీఫ్ సాగుపై ఆశలు గల్లంతయ్యాయి. ఈ నెలాఖరుతో గడువు సీజన్ ముగియనుంది. ఇప్పటివరకూ 20.39 శాతం విస్తీర్ణంలోనే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. వర్షాభావంతో ఖరీఫ్ పంటల సాగు ముందుకు సాగలేదు. అడపాదడపాగా వర్షాలు కురి శాయి. దీంతో విత్తనాలు వేయడానికి సరిపడా వర్షం లేక రైతులు చివరివరకూ ఎదురు చూస్తూనే ఉన్నారు. ఆగస్టుతో ఖరీఫ్ సీజను గడువు కూడా ముగిసిపోతోంది. సెప్టెంబరు నుంచి రబీ సాగు మొదలు కానుంది. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలపై పెట్టుకున్న ఆశలు దాదాపుగా గల్లంతయ్యాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా వివిధ పంటల ఉత్పత్తులను రైతులు కోల్పోయినట్లు అంచనా.

ఖరీఫ్ పంటల నుంచి వచ్చే ఆదాయం రబీకి పెట్టుబడికి దోహదపడేది. ఇప్పుడు పూర్తిగా పోయాయనే చెప్పొచ్చు. సాగయ్యే పంటలు కూడా ఆశాజనకంగా లేవు. వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఈ వారంలో వర్షాలు కురిశాయి. ఇప్పటికే వేసిన పంటలకు కొంత ఊపిరి పోశాయి. అయితే పంటలు భారీగా సాగు కాలేదు. 80 శాతం భూములు ఖాళీగానే ఉన్నాయి. ఇప్పుడు వేసినా పంట చేతికి వస్తుందనే నమ్మకం కూడా కనిపించడం లేదు. దీంతో ఇప్పుడు ఏ పంటలు వేయాలనే దానిపైనా రైతులు సందిగ్ధంలో పడ్డారు. రబీలో వేయాల్సిన పంటల కోసం సన్నద్ధమవుతున్నారు. జూన్, జూలై, ఆగస్టులో వర్షాలు కురిసినట్లు కనిపించినా పంటలకు సరిపడా లేవు. పొలాలు పదును కాలేదు. ఇక ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 1,29,102 హెక్టార్లు ఉండగా ఇప్పటివరకూ కేవలం 26,325 హెక్టార్లలో సాగయ్యాయి. గతేడాది 39,978 హెక్టార్లలో ఈ సమయానికి సాగయ్యాయి. అంటే గతేడాది కన్నా కూడా ఇప్పుడు సాగు బాగా తగ్గింది. వరి 1209 హెక్టార్లు, సజ్జ 1887 హెక్టార్లు, మొక్కజొన్న 3138 హెక్టార్లు, కొర్ర 428 హెక్టార్లు, కంది 6873 హెక్టార్లు, నువ్వు 2544 హెక్టార్లలో వేశారు. ఆముదం 998 హెక్టార్లలో ▶ 2లో

రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదు
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతం లో కేంద్రీకతమైన తీవ్ర అల్పపీడనం వాయు గుండంగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇది మంగళవారం ఉదయానికి వాయుగుండంగా దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉంది. ఈ కారణంగా కోస్తా తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో కోస్తాలో చెదురుమొదురుగా భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది. జిల్లాలో భారీ వర్షాల కంటే కృష్ణా నదికి వరద వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ విపత్తును సమర్థంగా ఎదుర్కొనడానికి జిల్లా అధికారులు సంసిద్ధమయ్యారు. ఇప్పటికే కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులతో వరుస సమీక్షలు జరిపి అందరినీ అప్రమత్తం ▶ 2లో



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

'చలో కరేడు'పై

పోలీసుల నిర్బంధం

- రైతు సంఘాల నేతల అక్రమ అరెస్ట్
- ప్రభుత్వ నిరంకుశ చర్యలపై నాయకుల ఆగ్రహం
- అక్రమ అరెస్టులపై తీవ్ర ఖండన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ, కందుకూరు

రైతుసంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు చలో కరేడు కార్యక్రమంపై పోలీసులు తీవ్ర నిర్బంధం విధించారు. సోమవారం నాడు ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయలు దేరిన నేతలను ఆంక్షల పేరుతో జాతీయ రహదారి నుంచి అడుగు కదపనీయలేదు. చట్టాల ఉల్లంఘన పేరుతో పోలీసులు నాయకులపై అరెస్టులకు తెగబడ్డారు. సుమారు 80 మంది వివిధ రైతు సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి.. కందుకూరు, వివి పాలెం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గత రెండు నెలలుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా,



కరేడు భూసేకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో అరెస్టయ్యి.. అనంతరం వివిపాలెం పోలీస్ స్టేషన్ నుంచి ర్యాలీగా వస్తున్న రైతుసంఘాల నేతలు

ప్రస్తుతం నెల్లూరు జిల్లా, కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ విద్యుత్ కంపెనీకి 8458 ఎకరాల సారవంతమైన సాగుభూముల బలవంతపు భూసేకరణపై పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగుతున్న అంశం విదితమే. ప్రభుత్వం నిర్బంధం విధించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భూసేకరణకు పాల్పడటంతో స్థానిక రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, నల్లమడ రైతు పోరాట సమితి, అఖిల భారత కిసాన్ మహాసభ, అఖిల భారత రైతు కూలి సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ▶ 2లో

నిర్లక్ష్యం వల్ల వ్యాధులు ప్రబలితే

క్రిమినల్ కేసులు పెడతాం..

▲ 8లో

రానున్న రెండు రోజుల్లో భారీవర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఎగువ నుంచి కృష్ణానదిలోకి వరద నీరు చేరుతున్న క్రమంలో ప్రకాశం బ్యారేజ్ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు, భారీ వర్షాలు హెచ్చరిక నేపథ్యంలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ 1077, సెల్ 08643-220226 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

గత కొద్ది రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా 50 వేల ఎకరాలు నీట మునిగాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం కొంచెం తగ్గడంతో రైతులు తమ వరి పొలాల్లో ఉన్న వరదనీటికి బయటకు పంపే ప్రయత్నాలు చేపట్టారు. భారీవర్షాలు, వరదల ప్రభావం రేపల్లె డివిజన్‌లో అత్యధికంగా ఉండే నేపథ్యంలో ఆర్‌డిఒ రామలక్ష్మి కొల్లూరు ఎంపిడివో కార్యాలయంలో అధికారులు, సర్పంచ్‌లతో సమీక్ష చేశారు.

ఖరీఫ్ గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

వేయగా పత్తి 8571 హెక్టార్లలో సాగయింది. ఇవే ప్రధానంగా సాగయ్యాయి. ఇవి కూడా ఆశాజనకంగా లేవు. పంటలు ఏ మేరకు చేతికి అందుతాయనేదీ ప్రశ్నార్ధకంగానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు చేజారినందున రైతులు తీవ్రంగా నష్టపోయినట్లే.. ఇక ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రబీ సాగుకు ఉపయోగపడతాయని రైతులు భావిస్తున్నారు.

రాత్రి 12 వరకు బార్లు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో 5, చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరుల లో ఒక్కో బార్ ఏర్పాటుకు గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, మార్కాపురం మున్సి పాలిటీల్లో రూ.55 లక్షలు ఎక్సైజ్ ట్యాక్స్, చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరు మున్సిపాలిటీలలో రూ.35 లక్షలు రెండు స్లాబ్‌లలో ఎక్సైజ్ ట్యాక్స్ నిర్ణయించామన్నారు. బార్ల లైసెన్సుల కోసం ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేయవచ్చని, ఎన్ని బార్లు అయినా పొందవచ్చని సూచించారు. దరఖాస్తులు ఈనెల 18 నుంచి 26వ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తామన్నారు. ఈనెల 28న ఉదయం 8 గంటలకు ఒంగోలు అంబేద్కర్ భవనంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానంలో బార్ల కేటాయిస్తామన్నారు.

గీత కులాలకు 3 బార్లు కేటాయింపు

గీత కులాలకు జిల్లాలో 3 బార్లు కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.ఆయేషా బేగం తెలిపారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గౌడ్‌కు 1 బార్, మార్కాపురం మున్సిపాలిటీలో గౌడకు 1, గౌండ్లకు 1 బార్ కేటాయించినట్లు ఆమె తెలియజేశారు. గీత కులాల ఉంచి ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30వ తేదీ ఉదయం లాటరీ ద్వారా బార్లు కేటాయిస్తామన్నారు.

రైతులు పొగాకు సాగు చేస్తే..

అధికారులపై చర్యలు

- ఎరువుల కొరత లేకుండా చూడాలి
- కలెక్టర్ జె వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఏ గ్రామంలోనైనా, మండలంలోనైనా రైతులు బర్లీ పొగాకు సాగు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో అన్ని మండల తహశీల్దార్లు, ఎంఎఓలు, ఏడిఏలతో జిల్లా కలెక్టర్ వెంకటమురళి వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో యూరియా సమస్యలపై ఆయన ఆరా తీశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోను బర్లీ పొగాకు సాగును నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమైందన్నారు. పొగాకు సాగుపై గ్రామాలలో విఏవోలు బీటా టామ్‌టామ్‌ల ద్వారా, సోషల్ మీడియా ద్వారా, పత్రికల ద్వారా మరియు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లు లోతట్టు ప్రాంతాలపై దష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇన్చార్జ్ సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్యాంసన్, మార్క్‌ఫెడ్ డిఎం కరుణశ్రీ, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ లవన్న, రైతు సంఘ సభ్యులు, నీటి సంఘ సభ్యులు, పిఏసిఎస్‌లు, వీక్షణ సమావేశం ద్వారా చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, మండల తహశీల్దార్లు, ఎంఏఓలు, ఏడిఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

'చలో కరేడు'పై పోలీసుల నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

వంటి 10 సంఘాల మద్దతుతో తమ భూములను బలవంతపు భూసేకరణనుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా ఆందోళన చేపట్టారు. అమరావతి న్యాయవాదుల అసోసియేషన్ మద్దతు కూడా కూడగట్టారు. రైతులు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో కందుకూరు శాసనసభ్యుడు నేరుగా రంగంలో దిగి ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలు తీవ్రం చేశారు. దీంతో అగ్రహించిన స్థానిక రైతులు, రైతు సంఘాలు సోమవారం నాడు చలో కరేడు కార్యక్రమానికి పిలుపునిచ్చాయి.

రైతు సంఘ నేతలను అడ్డగించిన పోలీసులు

సోమవారం నాడు కరేడు వెళుతున్న సుమారు 200 మంది రైతు సంఘాల ప్రతినిధులు, నాయకులను పోలీసులు జాతీయ రహదారిపై పీటీపీ కంపెనీ వద్ద అడ్డగించారు. జాతీయ రహదారి పై నుంచి అడుగు ముందుకు వేయనీయలేదు. ఈ ప్రాంతం లో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు ఉన్నందున ఏ ఒక్కరినీ కరేడుకు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఆందోళనకారులను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించిన పోలీస్ అధికారులు సుమారు 80 మంది రైతుసంఘ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్, ప్రైవేట్ వాహనాల్లో వలేటివారిపాలెం, కందుకూరు తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు.

రైతు సంఘాల నేతలు అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన వారిలో రైతు సంఘ రాష్ట్ర నాయకులు కె.కేశవరావు, నల్లమడ రైతు పోరాట సమితి రాష్ట్ర నాయకులు కొల్లా రాజమోహన్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు వి శ్రీనివాసరావు, మరో రాష్ట్ర నాయకులు మాగంటి హరినాధ్, గణేష్ బాబు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్సులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా నాయకులు మూలం రమేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుజ్జూరి జయంతి బాబు, పమిడి వెంకటరావు, ఉపాధ్యక్షులు షేక్ మాబు, టి శ్రీకాంత్, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, గొర్రెలమేకల పెంపకందారుల సంఘ జిల్లా కార్యదర్శి టి తిరుపతిరావు, నాయకులు పూసపాటి వెంకటరావు, కొమ్మాలపాటి మాల్యాద్రి, వి మోజెస్, టి రాము, కందుకూరు నాయకులు ఎం రమణయ్య, ఐద్వా నాయకురాలు షేక్ మున్వర్ సుల్తానా, రైతు కూలి సంఘ నాయకులు ఎల్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సొంత పూచీకత్తుపై విడుదల

పోలీసులు అరెస్టు చేసిన రైతుసంఘం నేతలను సాయంత్రం 5 గంటలకు సొంత పూచీకత్తుపై వలేటివారిపాలెం పోలీసులు విడుదల చేశారు. అనంతరం నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.



తనిఖీ చేస్తున్న అధికారి

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్ నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎరువుల నిల్వలను, రిజిస్టర్స్‌ను, స్టాక్ బోర్డ్‌లకు వ్యాత్యాసం లేకుండా ఎంఆర్‌పి ధరలకే ఎరువులు అమ్మకాలు జరపాలని, రైతులకు బిల్లు ఇవ్వాలని, అనుమతి ఉన్న ఎరువులను మాత్రమే కొనుగోలు చేసి రైతులకు అమ్మకాలు చేయాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కరేడు భూములు కాపాడేవరకూ పోరాటం

ప్రజాసంఘాల నాయకులు షేక్ ఖాదర్ బాషా, సయ్యద్ హనీఫ్

అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-పామూరు

పేద రైతుల భూములు కాపాడేంతవరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం ఆగదని ప్రజా సంఘాల నాయకులు షేక్ ఖాదర్ భాష, సయ్యద్ హనీఫ్ అన్నారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య భవనం సెంటర్లో అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పేదల భూములను కంపెనీలకు దౌర్జన్యంగా కట్టబెట్టడం అన్యాయం అన్నారు. కూటమి ప్రభుత్వం కంపెనీలు అమ్ముడు పోయిందని ఆరోపించారు. చలో కరేడు కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసులు, సుబ్బారావు రమేష్ సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, కేశవరావు బడుగు వెంకటేశ్వర్లు ప్రభాకర్ రెడ్డి, కుమార్, వీరిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయటం పోలీసులు తగదు అన్నారు. కరేడు భూములు దౌర్జన్యంగా లాక్కుంటున్న వారికి ప్రజలు గత ప్రభుత్వానికి చెప్పిన గుణపాఠం కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారన్నారు. అక్రమ అరెస్ట్ వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 50 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ఇండో షోల్ కంపెనీకి 7400 ఎకరాల భూమిని పేదల నుంచి లాక్కోవడం సరైంది కాదన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు జోలికి వస్తే ప్రభుత్వాలు కూలటం ఖాయమని ఖాదరబాషా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.శ్రీను, ఎస్.పిచ్చి రెడ్డి, షేక్ అల్లాభక్షు, సయ్యద్ గౌస్ బాషా, షేక్ మస్తాన్, షేక్ ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు ,షేక్ సుభాని, పాల్గొన్నారు.



పామూరులో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్



టంగుటూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

టంగుటూరు: ఇండోసోల్ కంపెనీ కోసం కూటమి ప్రభుత్వం కరేడు గ్రామంలో బలవంతంగా రైతుల నుంచి భూమిని సేకరించటాన్ని నిరసిస్తూ అఖిల పక్ష రైతు సంఘాలు సోమవారం చలో కరేడు కార్యక్రమానికి పిలుపునివ్వగా ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన వామపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలను కరేడు ర్యాంపు వద్ద అక్రమంగా, దౌర్జన్యంగా అరెస్టు చేసి కందుకూరు, వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ ప్లకార్డులు పట్టుకొని టంగుటూరు బొమ్మల సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు, ఇతర నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు పూనుకుంటే ప్రాణ త్యాగానికైనా సిద్ధ పడతామని కరేడు గ్రామ ప్రజలు అధికారులకు తెగేసి చెప్పారని తెలిపారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీ కోసం పని చేస్తే ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టీ.రాము, వి.మోజెస్, టీ.పాపారావు, కూతల ప్రసాద్, టీ.నారాయణ రావు, టీ.రామ్మూర్తి, జీ.కాశీవిశ్వనాద్, ఎస్కె. శ్రీనివాసరావు, తిరుమల రావు, హేతు వాదసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. కాలేషాబేగ్, న్యూ డెమోక్రసి పార్టీ జిల్లా నాయకులు టీ.వెంకటరావు, సిపిఐ మండల కార్యదర్శి టీ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ



జయప్రకాశ్ (ఫైల్)

శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని రన్వే మీద ముందు వెళ్తున్న అకస్మాత్తుగా ఆగడంతో వెనక వైపు నుంచి వస్తున్న మోటార్ బైకు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన ఇత్తడి జయప్రకాష్ (38) మోటార్ బైక్ మీద శింగరాయకొండకు వస్తున్నాడు. ముందు వెళ్తున్న లారీ ఆకస్మికంగా ఆగిపోవడంతో లారీని ఢీఢీకొట్టాడు. జయప్రకాష్‌కు హెల్మెట్ ఉన్నప్పటికీ హెల్మెట్ సైతం ముక్కలై రోడ్డుపై పడిపోయాడు. హైవే పోలీసులతోపాటు 108 వాహనం వచ్చి ఆసుపత్రికి తరలించుకొని పోతున్న సమయంలో అప్పటికే తీవ్ర గాయాలతో రక్తం మడుగుల్లో ఉన్న జయప్రకాష్ కొంచెం దూరం వెళ్ళగానే మృతి చెందాడు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జయప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దివ్యవాణి నందనవనంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నారు. మృతుడు జరుగుమల్లి మండలం కే బిట్రగుంట వద్ద ఉన్న పెట్రోల్ బంకులు సూపర్వైజర్‌గా పని చేస్తూ తన యాజమాని శింగరాయకొండలో ఉండడంతో అతన్ని కలిసేందుకు మోటారు బైక్ మీద హెల్మెట్ ధరించి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. హైవే పోలీసులతో పాటు ఎస్ఐ బి.మహేంద్ర ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడిని వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-తాళ్ళూరు : మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో రెస్టారెంట్ యజమాని పుట్లూరి వెంకటరెడ్డి అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ఎస్ఐ జి.మోహన్‌రావు కేసు నమోదు చేశారు.



కల్వర్టును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించే ప్రదేశాలలో గస్తీ

జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఎగువున కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న లోతట్టు ప్రదేశాలను జిల్లా ఎస్పీ తుషార్ డూడి సోమవారం స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టుల పై నుంచి వరద నీరు ప్రవహిస్తున్న ప్రదేశాలలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన రక్షణ పరమైన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరద ఉధృతితో పెదపులివర్రులోని చినరేవు, దోనేపూడి వద్ద కల్వర్టులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులు గురించి అధికారులతో మాట్లాడారు. నీట మునిగిన కల్వర్టుల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. 12 చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీస్ శాఖ విధులు నిర్వహిస్తుందన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 112/100 లేదా సంబంధిత స్టేషన్‌లో సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఎఫ్‌బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఎస్ఐలు ఉన్నారు.

'మోపాడు' ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

మోపాడు ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం మొదలైన దృష్ట్యా రైతులకు సాగు నీరు అందించడం అత్యవసరమని తెలిపారు. మోపాడు ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనులలో భాగంగా జైకా సహకారంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇవి ఆలస్యం కావడం వలన ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కోకూడదని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

రైతుల జీవనోపాధి వ్యవసాయం మీద ఆధారపడి ఉంటుందని గుర్తు చేస్తూ, వారిని ఆదుకునే విధంగా ఆయకట్టు రైతులకు ఈ వర్షాకాలంలో పంటలకు సరిపడా నీరు అందేలా తప్పక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖ డిఈ కె.విజయ భాస్కర్ రెడ్డి, ఏఈలు సిహెచ్ ప్రసాద్, వినయ్ కుమార్, రామకృష్ణ, మోపాడుప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ సి.కొండయ్య, వైస్ చైర్మన్ ఎం.నరసింహారావు, కాంట్రాక్టర్ ఎం.వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

అర్జీలు స్వీకరించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజా ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మరియు పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు వారి ఫిర్యాదుల గురించి జిల్లా ఎస్పీ గారు మరియు పోలీస్ అధికారులుకు విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదుల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అందిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. పోలీసు శాఖ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని, ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, ఎక్కవగా భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి ప్రజా ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్ రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

భార్యను హేళన చేస్తున్నారని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యజమాని తన భార్యను చులకనగా మాట్లాడుతున్నాడని మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు యత్నించాడు. స్పందించిన పోలీసులు ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అర్ధవీడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కర్నాటి వెంకట రంగారెడ్డి(30) కనిగిరి మండలం బల్లిపల్లిలో స్నేహ పౌల్ట్రీ కోళ్ల ఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈయన 4 నెలల క్రితం పొదిలి మండలం తుమ్మగుంట గ్రా మానికి చెందిన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అప్పటినుండి పౌల్ట్రీకి చెందిన క్వార్టర్స్‌లోనే కాపురం ఉంటున్నారు. ఎస్‌సికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడని, పౌల్ట్రీ యజమాని రఘునాథరెడ్డి హేళనగా మాట్లాడుతున్నాడని ఆవేదన చెంది తన యాజమానిపై గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వటానికి భార్యభర్తలు సోమవారం ఉదయం ఒంగోలు వచ్చారు. పెన్ను తెస్తానని బయటికి వెళ్లి ఎలుకల మందు పేస్టు తెచ్చుకొని, నీళ్ల బాటిల్‌లో కలుపుకొని తాగాడు. గమనించిన భార్య రాణి పోలీసుల సాయంతో ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు. స్పందించిన వైద్యులు కర్నాటి వెంకట రంగారెడ్డికి వైద్యం అందిస్తున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలియజేశారు.

ఘర్షణ ప్రాంతాల్లో నిమజ్జనానికి అనుమతులు లేవు : సిఐ

ప్రజాశక్తి-పామూరు : ఈనెల 27 నుంచి జరగబోవు నిమజ్జనం కార్యక్రమానికి ఘర్షణ ప్రాంతాలలో పర్మిషన్ ఇవ్వబోమని సిఐ భీమా నాయక్ తెలిపారు. సోమవారం సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గతంలో అంకాలమ్మ వీధిలో ఘర్షణ వాతావరణం జరిగిందని అక్కడ పర్మిషన్ ఇవ్వడం లేదన్నారు. ఊరేగింపులో పెద్ద శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేసినా, మద్యం తాగి ఇతరులకు ఆటంకం కలిగించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

శాస్త్రీయ దృక్పథమే అభివృద్ధికి దిక్సూచి


జెవివి గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న కార్యవర్గం

ప్రజాశక్తి - బాపట్ల

శాస్త్రీయ దృక్పథంతోనే సుస్థిరమైన సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం జీవితా చరణగా కలిగి ఉండాలని ఎన్టీఆర్ స్మారక వైద్య కళాశాల వైద్యులు చల్లా రామమోహనరావు అన్నారు. జెవివి జిల్లా 18వ మహాసభ స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల్లో నిర్వహించారు. సభకు జెవివి జిల్లా అధ్యక్షులు వై భాస్కర రావు అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ రామమోహ నరావు మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు విడనాడాలని అన్నారు. మంచి ఆరోగ్య అలవాట్లు కలిగి ఉండాలని అన్నారు. ఎబిపిఎస్ఎన్ జాతీయ కమిటీ సభ్యులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ 38ఏళ్ల క్రితం వైద్యులు, మేధావులతో ఏర్పడిన జెవివి నేడు ఉపాధ్యా యులు, ఉద్యోగులు, సామాన్య ప్రజానీకం చేరికతో విస్తృత పరిధిలో పనిచేస్తోందన్నారు. శాస్త్రీయ సమాజం నెలకొల్పే లక్ష్యంగా పనిచేస్తున్న జెవివిలో సభ్యులుగా చేరాలని కోరారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కు౹రా రామారావు మాట్లాడుతూ జెవివి అక్షరాస్యతా ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమం, ఇతర సామాజిక ఉద్యమాల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ జయప్రకాష్, రాష్ట్ర పబ్లికేషన్స్ సబ్ కమిటీ కన్వీనర్ దార్ల బుజ్జిబాబు, జెవివి సీనియర్ నాయకులు డాక్టర్ రఘుచంద్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, ఎ శ్రీనివాసరావు మాట్లాడారు. తొలుత గోడ ప్రతులు ఆవిష్కరించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి బి పిచ్చయ్య పాల్గొన్నారు.

జెవివి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జెవివి జిల్లా 18వ మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవా ధ్యక్షులు వై భాస్కరరావు, వై హనుమంతరావు, ఐ రంగారావు, గౌరవ సలహాదారులు సాయి ప్రసాద్, ఆర్ ఆంజనేయులు, కోట వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షులు డి హరిబాబు, ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు, కోశాధికారి గుమ్మా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి పిచ్చయ్య, పివి ప్రసాద్, నాగవర్ధన్, కార్యదర్శులు బివి రత్నం, కె నాగేశ్వరరావు, ఎన్ కళాధర్, సోమశేఖర్, జి రాజేష్, పివి శ్రీనివాస్, సబ్ కమిటీ కన్వీనర్లు పద్మజ (సమత), చల్లా రామమోహనరావు, యు దక్షిణామూర్తి (సాంస్కృతిక), మన్నం త్రిమూర్తులు (పర్యావరణ), పి రామాంజనేయులు (చెకుముకి) 10మంది జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.


ఆటో స్టాండ్ ప్రారంభించిన ఎస్ఐ విజయ్ కుమార్

ఆటో స్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆటో స్టాండును పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. పాండురంగాపురం వైపు వెళ్లే ఆటోలు నిలిచే ఆటో స్టాండ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు సైతం ఆటోలు నడుపుతూ ప్రజలకు రాకపోకల సౌకర్యాలు కల్పిస్తూ ఆటో కార్మికులు ఉపాధి పొందడం అభినందనీయమని అన్నారు. అయితే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పరిమిత వేగంతో ప్రయాణి కులను పరిమితంగా ఎక్కించుకొని సురక్షితంగా గమ్యం చేర్చాలని ఆన్నారు. ఆటో కార్మికులు ఐక్యతతో యూనియ న్ ఏర్పాటు చేసుకొని నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం అన్నారు. ఆటో డ్రైవర్లు మత్తు పానీయాలకు బానిసలు కాకుండా సక్రమమైన మార్గంలో జీవనం సాగించాలని, మంచి నడవడిక కలిగి ఉండాల న్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకు లు కె శరత్, ఆటో యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు బి రాఘవరెడ్డి, కె ప్రేమ్ చక్రవర్తి, కోశాధికారి జి శివారెడ్డి, ఆటోకార్మికులు శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి

వరద ప్రభావంపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణా నదిలోకి 2.50 లక్షల క్యూసెక్కులు నీరు వదలడంతో కృష్ణానది పరివాహ ప్రాంతం ముంపుకు గురయ్యే గ్రామాలను గుర్తించాలని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సోమవారం నిర్వహించారు. నదీ పరివాహక గ్రామాల్లో వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు, అనారోగ్యంతో ఉన్న వారి వివరాలు తీసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని చెప్పిందని, ఈ వర్షాలతో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున పునరావాస కేంద్రాలు గుర్తించి ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను తరలించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. వరద ఉధృతి పెరిగితే లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రిలీఫ్ సెంటర్ దగ్గర ఒక మండల స్థాయి అధికారి ఉండాలని సూచించారు. లంక గ్రామాల ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ విషయాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారాన్ని దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ కె నరసింహారావు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యుల నియామకం

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లీగల్ సెల్ సభ్యులను స్టేట్ సెక్రటరీ షేక్ మేరా సాహెబ్, లీగల్ సెల్ ఇంచార్జ్ షేక్ జాఫర్ నియమించినట్లు తెలిపారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ యూత్ అధ్యక్షులు సయ్యద్ షకీల్ అహ్మద్, వేటపాలెం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ షేక్ మీరసా బాబు, రాష్ట్ర లీగల్ సెల్ ఇంచార్జ్ షేక్ జబ్బార్ పాల్గొన్నారు. సభ్యులకు నియామక పత్రాలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా లీగల్ సెల్ ఇంచార్జ్ చీరాలకు చెందిన షేక్ సిరాజ్, చినగంజాంకు చెందిన షేక్ మొహమ్మద్ పాల్గొన్నారు.


ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సుబ్బారావు

ప్రజాశక్తి - కొల్లూరు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ బి వెంకటేశ్వర్లుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆటోలతో బస్టాండ్ సెంటర్ నుండి గ్రోమోర్, పోలీస్ స్టేషన్, క్లాక్ సెంటర్, వర్ధన్ మార్ట్ మీదుగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యద ర్శులు రాజు, రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో కార్మిక యూనియన్ నాయకులు విజయ్, నాంచారయ్య, శ్రీను, శివ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు రుణాల చెక్కులు అందజేత


రుణ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రైతులు సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీల అభివృద్ధికి తోడ్పాటు నందించాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచించారు. భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు 2025-26 సంవత్సరానికి 85 మందికి రు.5.36 కోట్ల సిసి, వ్యవసాయ రుణాల పంపిణీ చేశారు. భట్టిప్రోలు సంఘంలోని బొజ్జా ఏసుబాబు అను రైతు ట్రాక్టర్ ప్రమాదంలో మరణించగా అతని కుటుంబ సభ్యులకు భీమా క్రింద రూ.2లక్షల విలువైన చెక్కు అందజేసారు. కార్యక్రమంలో బ్యాంకు ఎజిఎం దొప్పలపూడి శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ అరుణ, సొసైటీ చైర్మన్ పరుచూరు రమేష్, డైరెక్టర్లు కొలుసు వెంకట శేషగిరిరావు, గొట్టిపాటి కృష్ణారావు, నాయకులు తునుగుంట్ల సాయిబాబా, పిఎసిఎస్ సిఇఒ వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఒంగోలులో ఉమ్మడి ప్రకాశం యోగాసన్ అసోసియేషన్ నిర్వహించిన యోగా పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో రావినూతల పాఠశాలకు చెందిన విద్యార్థులు పి అనుస్మిత, కె శ్రీవల్లి, సిహెచ్ గీతాంజలి, పి మానిష్, బి జాహ్నవి ఐదుగురు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతులు సాధించి ఈనెల 21న తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కె కళ్యాణి సోమవారం అభినందించారు. సభలో పూర్వ విద్యార్థులు తమ్మన హనుమంతరావు, పల్లపోతు రామాంజనేయులు రూ.2వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వికలాంగ జంటలకు ఘనంగా వివాహం



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షహనాజ్- సర్దార్ భాష ఆధ్వర్యం లో ఒంగోలు అంబేద్కర్ భవనంలో సోమవారం మధుసూదన్ రావు-లక్ష్మీ దంపతులు, రాజశేఖర్-ప్రీతి దంపతు లకు ఘనంగా వివాహం జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ వధూవరులను ఆశీర్వదించారు.


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

బాపట్ల జిల్లాకు 'దుగ్గిరాల' పేరు పెట్టాలి

ప్రజాశక్తి - చీరాల

ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడును కలిసి బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్వాతంత్ర్య సమరయోధుడిగా, సమాజ సేవకుడిగా, రైతు, కార్మిక హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా చిరస్మరణీయుడని గుర్తు చేశారు. ఆయన పేరు జిల్లాకు పెట్టడం ద్వారా కొత్త తరం యువతకు స్ఫూర్తి కలుగుతుందని అన్నారు. అలాగే ఈ ప్రతిపాదనపై తక్షణ చర్య తీసుకొని కలెక్టర్‌కు నివేదిక పంపించాలని కోరారు. గోపాలకృష్ణయ్య కృషి, త్యాగాలు, సామాజిక సేవలు గుర్తించటం ద్వారా బాపట్ల జిల్లా ప్రతిష్టను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, ఎ నాగ వీరభద్రావారి, దొగుపర్తి వెంకట సురేష్, చెక్క నారాయణ, శివాంజనేయ ప్రసాద్, రమణారావు, సుబ్బారావు, తుకారాం, శ్రీనివాసరావు, బుల్లిబాబు, ఉమా పాల్గొన్నారు.


తహశీల్దారు ప్రభాకరరావును అభినందిస్తున్న దృశ్యం

తహశీల్దారుకు అభినందనలు

ప్రజాశక్తి - చిన్నగంజాం

ఉత్తమ సేవా అవార్డు అందుకున్న తహశీల్దారు జె ప్రభాకరరావును ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీస్ ఐక్య వేదిక ప్రతినిధులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు మాట్లాడారు. ప్రభాకరరావు గతంలో పొదిలి, అద్దంకి, మర్రిపూడి, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో తహశీల్దారుగా ఉత్తమ సేవలు అందించారని అన్నారు. ఆయా మండలాల్లో ఆయన చేసిన సేవలకు ప్రజల అభిమానం పొందారని అభినందించారు. మండలంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తెలగతోటి రాధాకృష్ణ మూర్తి, జ్యోతి డేవిడ్, జైభీమ్ చంటి బాబు, కొమ్మాలపాటి బుజ్జి, ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నక్క కాంతారావు, మదర్స్ ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దష్టి పెట్టి త్వరితగతిన పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబు లేసుతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు నాణ్యతగా అర్జీలను పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీలను సకాలంలో, గడువులోగా


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాల న్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, కుమార్, జాన్సన్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. సోమవారం నాడు ఒంగోలు ఎల్‌బీజీ భవనంలో జిల్లా అధ్యక్షుడు కె.వి.పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి క్లాసులకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు మాట్లాడుతూ జిల్లాలో ఒంగోలు వాన్‌పిక్ భూముల అభివద్ధి, కనిగిరి నిమ్జ్, దొనకొండలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే



మాట్లాడుతున్న రామన్న

జిల్లాకు పారిశ్రామిక అభివద్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పి.కిరణ్, పి.నరేంద్ర, జి.కొండయ్య, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత బకాయిలు రద్దు చేయాలని

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎల్ఐసి ఏజెంట్లకు ప్రొఫెషనల్ టాక్స్ పాత బకాయిలు రద్దు చేయాలని కోరుతూ ఎల్ఐసిఎఒఐ ఒంగోలు బ్రాంచి కమిటీ ఆద్వర్యంలో సోమవారం నాడు ఒంగోలు ఎల్ఐసి కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో ఒక్క సారి కూడా ప్రొఫెషనల్ టాక్స్ గురించి ఏజెం ట్లకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఇప్పుడు ఒకేసారి ఐదు సంవత్సరాల డబ్బులు కట్టమనడం చాలా అన్యాయమన్నారు. 60 సంవత్సరాల వయస్సు దాటిన ఏజెంట్లను టాక్స్ పరిధి నుండి మినహాయించాలని కోరుతూ సంతకాల


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సేకరించి ప్రజాప్రతినిధు లకు అందజేస్తామని, అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎల్ఐసిఎఒఐ బ్రాంచి నాయ కులు సి.హెచ్.వి.సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, కె.రమణారెడ్డి, బి.కృష్ణ మూర్తి, యం.వెంగళ రావు, యం.సుబ్బారావు, పి.శ్రీనివాసరావు, పురుషోత్తం, నారాయణరెడ్డి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15.3 మి.మీ.ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో జిల్లాలో 15.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అర్ధవీడులో అత్యధికంగా 45 మిల్లీమీటర్లు, కురిచేడులో అత్యల్పంగా 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈవిధంగా ఉన్నాయి. రాచర్లలో 43.8 మిల్లీమీటర్లు, మార్కాపురంలో 32.6, తర్లుపాడులో 29.4, కంభంలో 27.6, పెద్దారవీడులో 26.8, బేస్తవారపేటలో 22.8, వెలిగండ్లలో 21, పుల్లలచెరువులో 20, గిద్ద లూరులో 19.8, హెచ్ఎంపాడులో 18, సిఎస్‌పురంలో 18, యర్రగొండపాలెంలో 17.6, దోర్నాల లో 16.4, సింగరాయకొండలో 15.6, పామూరులో 15.4, త్రిపురాంతకంలో 14.4, కొనకన మిట్లలో 14.4, దొనకొండలో 13.2, పొన్నలూరులో 13,2, ఒంగోలు రూరల్‌లో 12,8, దర్శిలో 12.4, కొండపిలో 11.6, పొదిలిలో 11.4, కనిగిరిలో 11.4, కొమరోలులో 10.2, చీమకుర్తిలో 10, మర్రిపూడిలో 9.8, టంగుటూరులో 6.2, మద్దిపాడులో 5.6, సంతనూతలపాడులో 5, జరుగుమల్లిలో 4.6, నాగులుప్పలపాడులో 4.2, ముండ్లమూరులో 3.8, తాళ్ళూరులో 3.6, కురిచేడులో 2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. కొత్తపట్నంలో వర్షం కురియలేదు.

'చెత్త' పేరుతో 'సంపద' జేబుల్లోకి.!

ఒంగోలు నగరపాలక సంస్థలో 'శానిటేషన్' మాయాజాలం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలో పారిశుధ్యం మెరుగుకాక పోయినా చేసే ఖర్చు మాత్రం రూ.లక్షల్లోనే ఉంటోంది. చెత్త పేరు చెప్పి.. అధికారులు జేబులు నింపుకుంటున్నారు. పారిశుధ్య పనుల కోసం కోవిడ్‌లో తీసుకున్న వాళ్లను కాక మరికొంతమందిని అదనంగా ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వాళ్లని ఏ అథారిటీతో నియమించారో ఎవరికీ తెలియదు.



గుత్తికొండవారిపాలెంలో కంపోస్ట్ యార్డ్ ఉండగా, జిటిఎస్ (గార్బేజ్ ట్రాన్సుర్ స్టేషన్) పేరుతో కొత్త మామిడిపాలెంలో ఉన్న మినీ కంపోస్ట్ యార్డ్‌లో మాయాజాలానికి తెరలేపారు. జిటిఎస్‌లో ఆటోల ద్వారా పుష్‌కార్టుల ద్వారా వచ్చిన చెత్తని తిరిగి, కాంపాక్టర్లలోకి, ట్రాక్టర్లలోకి తీసుకొని అక్కడి నుంచి గుత్తికొండవారిపాలెంకు తరలించవలసి ఉంది. ట్రాక్టర్ల ద్వారా కొత్త మామిడిపాలేనికి చెత్తని తరలిస్తున్నారు. ఆ మాయాజాలంలో లబ్ధి పొందుతోంది అధికారులే. ట్రాక్టర్ల ద్వారా డైరెక్ట్‌గా చెత్తని గుత్తికొండవారిపాలేనికి తరలించకుండా ఉండటంలో ఉద్దేశమేమిటో వారికి తప్ప ఎవరికీ తెలియదు. కొత్త మామిడిపాలెంలో 10 మంది మనుషులు, జెసిబి నిరంతరం పనిచేస్తూ ఉంటాయి. రూ.లక్షల్లో బిల్లులు చేస్తున్నారు. మరో విషయమేమిటంటే.. శానిటేషన్‌కు సంబంధించి టెండర్లు లేకుండా బాక్స్ టెండర్ల పేరుతో రు.లక్షల బిల్లులు ఇబ్బడి ముబ్బడిగా సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. బ్లీచింగ్, దోమల మందులు, కెమికల్స్ అథారిస్డ్ మాన్యుఫాక్చరర్స్ నుంచి కొనాలి. కానీ అధికారులు లోకల్ కాంట్రాక్టర్ల నుంచి కొనటానికి తెరలేపారు.

ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే నగరంలో ఎక్కడ సిగ్రిగేషన్ ఎట్ సోర్స్ అంటే ప్రతి ఇంటి దగ్గర నుంచి వేరు చేసిన చెత్తను తీసుకోవాలి. అది ఐదు పర్సెంట్ కూడా అమలు కావడం లేదు. వచ్చిన చెత్తలో నుంచి ఇటీవల ప్లాస్టిక్ ని ఏరే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలిసిపోయిన చెత్త నుంచి ప్లాస్టిక్‌ని ఎలా ఏరతారో తెలియదు. అందరికీ చూపించడం కోసం బెయిలింగ్ మెషిన్ తెచ్చి వచ్చిన కొద్దిపాటి చెత్తని బేలింగ్ ద్వారా చూపించి ప్రజల కళ్లకి గంతలు కడుతున్నారు. మూడు బుట్టల విధానం అమలు చెయ్యకుండా ఇదెలా సాధ్యమో అధికారులే చెప్పాలి.

మార్కెట్ వేస్ట్ నుంచి వర్మీ కంపోస్ట్ పేరుతో మరో అవినీతికి తెర లేపారు. ఎంత ఖర్చయిందో లెక్కలేదు. ఆదాయం సంగతి తర్వాత పర్యావరణం బాగుపడిందా.? అంటే అదీ లేదు.

శానిటేషన్ విభాగంను కొంతమంది అధికారులు ఎటిఎంగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు ప్రతినెలా ముడుపు లందుతున్నాయనే ప్రచారం ఉంది. శానిటేషన్‌కి ప్రతి నెలా జరిగే ఖర్చు తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. అంతేకాదు ట్రాక్టర్లు, క్యాంపాక్టర్ల, డీజిల్ బిల్లులకి హద్దే లేదనేది బహిరంగ రహస్యం. డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్సుర్ లాగా ఇక్కడ డైరెక్ట్ ఆఫీసర్ ట్రాన్స్‌ఫర్ నడుస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుధ్యం పేరుతో పెట్టే ఖర్చులు నగరంలో పారిశుధ్యం మెరుగుపడటానికి మాత్రమే ఉపయోగపడేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అధికారుల వైఖరికి నిరసనగా

మున్సిపల్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ అధికారుల వైఖరికి నిరసనగా ఒంగోలు నగరంలో మున్సిపల్ కార్మికులు సోమవారం తీవ్ర ఆందోళనకు దిగారు. స్థానిక సమస్యలు పరిష్కరించక పోగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కార్మికులపై అసభ్యకరమైన దూషణలకు, అవమానించిన ఘటనకు నిరసనగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, సిఐటియు నగర కమిటీ పిలుపుతో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి టి. మహేష్, మున్సిపల్



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోగా కార్మికులను అవమాన కరంగా వ్యాఖ్యానిస్తున్నట్లు ఆరోపించారు. కక్ష సాధింపుతో వార్డులు మార్చడం, వేతనాల కోతలు పెట్టడం వల్ల కార్మికులు మానసిక ఒత్తిడికి గురై హాస్పిటల్ పాలవుతున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులు ఆందోళన బాట పట్టారని, తక్షణమే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ధర్నా అనంతరం కార్మిక ప్రతినిధులు మున్సిపల్ మేయర్ గంగాడ సుజాతకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి. నరసింహం, టీ. విజయమ్మ, రాగే రాములు, లక్ష్మీకాంతం, కోటేశ్వరి, కె మోహన్ రావు, బి కోటేశ్వరరావు, కె వంశీ, ఎం దివ్య, అనిత, కె పద్మ, జేమ్స్ పాల్గొన్నారు.

---

19 బార్లకు నూతన లైసెన్సులు

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం పాత బార్ పాలసీ రద్దు చేసి 2025-2028 సంవత్సరానికి గానూ నూతన బార్ పాలసీని విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నూతన బార్ పాలసీలో బాపట్ల జిల్లాలోని బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 5, చీరాల మున్సిపాలిటీలో 7, రేపల్లె మున్సిపాలిటీలో 4, అద్దంకి నగర పంచాయతీలో 1 బార్ మొత్తంగా 17 బార్‌లు, గీత కులాలకు సంబంధించి బాపట్ల మున్సిపాలిటీలో 1, రేపల్లె మున్సిపాలిటీలో 1 కలిపి.. జిల్లాలో మొత్తం 19 బార్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొత్త బార్ పాలసీ ఆర్థిక అడ్డంకులు తగ్గించడానికి, బార్ కార్యకలాపాలు లాభదాయకంగా చేయడానికి దోహద పడుతుందని తెలిపారు. ఈ బార్‌ల కేటాయింపు పాత పద్ధతిలోని వేలం ద్వారా కాకుండా ఎ4 షాపులకు జరిపిన


వెంకటేశ్వర్లు


విధంగా లాటరీ పద్ధతి చీటీల (డ్రా ఆఫ్ లాట్స్) ద్వారా జరుపుతారన్నారు. ఈ లాటరీలో పాల్గొనే వారు రూ.5 లక్షల దరఖాస్తు ఫీజు, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజును ఆన్లైన్, ఆఫ్ లైన్ లేదా హైబ్రిడ్ పద్ధతి ద్వారా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి దరఖాస్తులపై ఎటువంటి పరిమితి లేకుండా ఎన్ని దరఖాస్తులయినా పెట్టుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 26న సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని పేర్కొన్నారు. రెస్టారెంట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్న నిబంధన సడలించి, లాటరీ పద్ధతిలో బార్ లు దక్కించుకున్నవారు 15 రోజుల లోపు రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.గీతిక, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రభుదాస్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


లోకేష్‌తో ఎంపీ మాగుంట

లోకేష్‌ను కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు ఎంపీ పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్ర మంత్రులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.



బ్యాంకు మేనేజరు నాగరాజును అభినందిస్తున్న సిబ్బంది

మేనేజర్ నాగరాజుకు సత్కారం

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని చినపరిమి ఎపిజిబి మేనేజర్‌గా పని చేస్తున్న కటారి నాగరాజు గుంటూరు రీజినల్ కార్యాలయానికి బదిలీ కావడంతో బ్యాంకు సిబ్బంది ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ బ్యాంకు మేనేజర్‌గా అనకాపల్లి కెడిపేట నుండి దోమ నాగరాజు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జ్యోతిర్మయి, గాజుల హిమజ, మాచర్ల వీరేంద్ర, ఉన్నం సౌమ్య, గ్రామ పెద్దలు అవుతు వేంకటేశ్వరరెడ్డి, జంగా వెంకట రమణరెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి, మల్లంపాటి భావన్నారాయణ రెడ్డి, సంగపు వేణు మాధవ్, అవుతు అమృత కుమారి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ధర్మకర్తల మండలి

కొలువుదీరిన ధర్మకర్తల మండలి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనక నాగవరపమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ వేణుగోపాలరావు హాజరై ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ వలేటి ఆంజనేయులు, గోవిందు సుబ్బారావు, గుత్తి వీరప్రసాద్, చప్పిడి వెంకట్రావు, ఆతిన రమేష్, ఎర్ర శివ నాగమల్లేశ్వరి, చుండి శ్రీలక్ష్మి, ద్రోణాదుల సుబ్బాయమ్మ ధర్మకర్తలుగా కంచర్ల బిక్షాలు కో ఆప్షన్ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. చీరాల ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, సంతరావూరు పిఎసిఎస్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవతోటి సుందరరావు, దేవస్థానం ఇఒ పోతీన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని పౌర సరఫరా శాఖ జిల్లా అధికారి భాష డీలర్లను ఆదేశించారు. మండలంలోని రేషన్ డీలర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. రేషన్ సరుకులు ప్రజలకు సక్రమమైన పద్ధతిలో అందజేయాలని ఆదేశించారు. ప్రతినెలా 26 నుండి నెల ఆఖరు వరకు 65ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు. ప్రతి నెల 1నుండి 15వరకు రేషన్ షాపుల వద్ద బియ్యం, పంచదార పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు సిహెచ్ పద్మావతి, రేపల్లె సిఎస్ డిటి ఓంకార్ పాల్గొన్నారు.

నేటి నుండి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎస్టీ జనాభా గల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్టీ జనాభా ఆధార్ కార్డులు లేని వారికి సమాచారం ఇచ్చి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 19నుండి 22వరకు నిర్వహించే ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో ఆధార్ కార్డు లేని వారందరికీ ఆధార్ కార్డులు మంజూరు చేయించాలని సూచించారు. 19న ఆరుంబాక, గుల్లపల్లి, గూడవల్లి, రాంబోట్లపాలెం, 20న చెరుకుపల్లి, గుళ్ళపల్లి, తూర్పుపాలెం, కనగాల, 21న రాజోలు, పొన్నపల్లి, కావూరు, కనగాల, 22న బలుసులపాలెం, పొన్నపల్లి, కుంచాలవారిపాలెం, గూడవల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిఎసిఎస్‌లో ఎరువుల నిల్వలు పరిశీలన

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని అమృతలూరు, పెద్దపూడి పిఎసిఎస్ సంఘాల్లో ఎరువుల నిలవలను బాపట్ల ఎడిఎ కె ధనరాజు, ఎఒ ఎం హేమంత్ భరత్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. మండలంలో యూరియా 120 మెట్రిక్ టన్నులు, డిఎపి 140 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. రెండు రోజుల్లో అమృతలూరు పిఎసిఎస్ పరిధిలోని మూల్పూరుకు 54.55 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి రానున్నదని తెలిపారు. అమృతలూరు సొసైటీలో 19.85 మెట్రిక్ టన్నులు, ఇంటూరు సొసైటీలో 39.60 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డిఎపి ఎరువు వాడకం తగ్గించి 20:20:0:13 వాడుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులు పైపాటుగా వేయరాదని తెలిపారు. డిఎపిలో అధికంగా భాస్వరం ఉండటంవల్ల మొక్కలు సూక్ష్మ పోషకాలు గ్రహించే శక్తిని కోల్పోతాయని తెలిపారు. దానివల్ల జింకు లోపం వస్తుందన్నారు.

ఇంకొల్లు : మండలంలో రైతులకు అవసరమైన యూరియాతో పాటు డిఎపి, మొరటో పటాస్ ఎస్‌సిపి ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఎఒ ఎన్ మేరెమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విఎఎలు, ఉద్యాన సహాయకులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. 31 మెట్రిక్ టన్నుల యూరియా, 121 మెట్రిక్ టన్నుల డిఎపి, ఏడు మెట్రిక్ టన్నుల మొరాటో ఫొటష్ తోపాటు 44 మెట్రిక్ టన్నులు ఎస్సిపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విఎఎలు గ్రామాల్లో రైతులకు తెలిపి ఆందోళన చెందకుండా ఉంచేలా చేయాలన్నారు. రైతులు ఈ ఏడాది పొగాకు సాగు చేయవద్దని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పొగనారు ముళ్ళు కూడా రైతులు సాగు చేయవద్దని తెలిపారు.



అమృతలూరులో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న ధనరాజ్

కొల్లూరు : మండలంలోని ఎరువుల దుకాణాలను ఎఒ వి నరేంద్రబాబు సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఈ పాస్ మిషన్ లో ఉన్న ఎరువుల స్టాక్‌ను ఎరువుల షాపుల్లో ఉన్న స్టాక్‌ను సరిపోల్స్ చూశారు. మండలంలో యూరియా 80 మెట్రిక్ టన్నులు, డిఎపి 120 మెట్రిక్ టన్నులు, ఎస్ పో టాస్ 60 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 200 టన్నులు నిల్వ ఉన్నాయని తెలిపారు. పిఎసిఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా, జిడిసిఎంఎస్ సంస్థ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈనెల 20 నుంచి రైతు సేవా కేంద్రం ద్వారా ఎరువులు అందజేస్తామని తెలిపారు.

రేపల్లె : మండలంలోని కైతేపల్లి సొసైటీలో 55 టన్నులు యూరియా, 60 టన్నులు డిఏపి ఎరువుల నిల్వలు ఉన్నాయని కైతేపల్లి పిఎసిఎస్ చైర్మన్ వడ్డీ లక్ష్మోజి తెలిపారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని అన్నారు. పంటలు వేసే సమయానికి ఎరువులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయకుండా సొసైటీలో కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ సురేష్ బాబు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలో రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ షేక్ సైదా తెలిపారు. మండలంలోని కొమ్మాలపాడు, ఏల్చూరు గ్రామాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువుల నిల్వలు క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది. ఆయా ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

పొగాకు సాగు చేస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న తహశీల్దారు బ్రహ్మయ్య

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలో రైతులు పొగాకు పంట సాగు చేయవద్దని, ఎవరైనా సాగు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తహశీల్దారు బ్రహ్మయ్య, ఎఒ భాస్కరరావు తెలిపారు. పొగాకు నారు మడి కూడా వేయకూడదని చెప్పారు. ఎవరైనా పొగాకు సాగు చేసినట్లయితే పంట తీసివేయటమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. కంపెనీ వారు బాండ్ ఇచ్చిన కూడా పొగాకు పంట సాగు చేయకూడదని పేర్కొన్నారు. మండలంలో ఎరువులు కొరత లేదని, ఎరువులు సరిపడ నిల్వలు ఉన్నాయని చెప్పారు. రైతులు ఎవరు ఇబ్బంది పడవలసిన అవసరం లేదని తెలిపారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతుల తాము వేసిన పంట పొలాల్లో నీటిని బయటకు వెళ్లే విధంగా చూసుకోవాలని చెప్పారు. స్థానిక ఎఒ కార్యాలయంలో రైతులకు నూరు శాతం రాయితీపై విబిఎన్8 రకం మినుము విత్తనాలు సోమవారం పంపిణి చేసారు.

మెదరమెట్ల : ఈ ఏడాది బర్లీ పొగాకు పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఎఒ ఎస్ రామ్మోహనరావు సోమవారం తెలిపారు. కలెక్టర్ సమీక్షలో కొన్ని నియమ నిబంధనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దానిలో భాగంగా 2025- 26కు నల్ల బర్లి, తెల్ల బార్లీ సాగు చేయకుండా నిషేధించినట్లు తెలిపారు. ఎవరైన పొగాకు సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా పంట పొలాన్ని దున్ని వేస్తామని హెచ్చరించారు. టొబాకో కంపెనీ పొగాకు సాగు చేయమని చెప్పి ఆ మాటలు నమ్మవద్దని సూచించారు. ఎరువుల ఏజెన్సీలు కృత్రిమ డిమాండ్ సృష్టించటానికి ఎరువులు లేవని చెప్పినా, ఎక్కువ రేట్లకు అమ్మిన తమ దృష్టికి తేవాలని సూచించారు. తగినంత ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని రింగు రోడ్డు సెంటర్లో పార్క్ చేసిన బైకును కొద్ది సమయంలోనే గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని బొర్రా కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత కొన్ని నెలలుగా మోటార్ సైకిళ్ల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు మైనర్ వ్యక్తుల్ని పోలీసులు అరెస్ట్ చేసినట్లు డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు పెనుమూడి హైవే వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన ముగ్గురు మైనర్ వ్యక్తులను అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా పలు కేసుల్లో నేరం చేసినట్టు ఒప్పుకున్నారని తెలిపారు. రేపల్లె, వేమూరు, మంగళగిరి, తాడేపల్లి, చందోలు, చెరుకుపల్లిలో రెండు మోటర్ సైకిల్లు, చిలకలూరిపేట, నిజాంపట్నం, కొల్లూరులో మోటర్ సైకిల్లు దొంగిలించారని తెలిపారు. నిందితుల నుంచి రూ.9.60లక్షల విలువైన 10మోటార్ సైకిల్లు స్వాధనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకి పాల్పడుతున్నారని, తల్లి, దండ్రులు పిల్లలకు తగు సూచనలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఎస్ రాజశేఖర్, రాంబాబు, వీరాంజనేయులు, పూర్ణచంద్రరావు బాలకృష్ణను డిఎస్పి అభినందించారు.

వైసిపి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి నియోజకర్గ నూతన కార్యాలయం వైసిపి ఇన్చార్జి గాదె మధుసూనారెడ్డి ఆదేశాలతో స్థానిక ఎస్బిఐ బ్యాంకు మేడపైన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి చిన్నగంజాం, మార్టూరు, పర్చూరు మండలాల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి అనుబంధ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ పురుషోత్తం సోమవారం తెలిపారు. జిల్లా ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ 2025 నుండి 2027 నియామకానికి పాఠశాల విధి విధానాలు విడుదల చేసిందన్నారు. ఆసక్తి అర్హత గల పిఇటి, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) కనీసం 10ఏళ్ళ సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకొనవలని తెలిపారు.

విద్యార్థి సంఘాల ప్రవేశం రద్దు చేయడం దారుణం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించొద్దని కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులనున తక్షణమే ఉపసంహరించుకోవాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచవరపు రవికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యారంగాన్ని నీరుగార్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లోకి రాకుండా చీకటి ఉత్తర్వులిచ్చిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహించిన చంద్రబాబు నాయుడు ఇలాంటి ఉత్తర్వులివ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస వసతులు కల్పించలేదని అన్నారు. ఇలాంటి సమస్యలన్ని విద్యార్థి సంఘాల దృష్టికి వస్తాయనే ఇలాంటి ఉత్తర్వులిచ్చారని విమర్శించారు. తక్షణమే జీవో రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, విద్యార్థి నాయకులు దిలీప్, కట్టా రఘు, కంబాల బన్నీ, షణ్ముఖ పాల్గొన్నారు.



లాప్టాపులు బహుకరిస్తున్న రోటరీ సభ్యులు

ల్యాప్‌టాప్‌లు బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినిలకు లాప్‌టాప్‌లు సోమవారం బహుకరించారు. పెదనందిపాడు మండలం నాగభైరువారిపాలెంలో విద్యార్థినులు నాగుబడి గాయత్రి, నాగుబడి తరుణశ్రీలకు ఒక్కొక్కటి రూ.58 వేల విలువైన 2లాప్‌టాప్‌లు బహుకరించి నట్లు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. కొల్లా సాకేత్ ఫౌండేషన్ తరపున కొల్లా సాకేత్ జన్మదినం సందర్భంగా అతని తాత నాగుబడి సుబ్బా రావు లాప్‌టాప్‌లకు అవసరమైన రూ.1.16 లక్షల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు రోటరీ చేస్తున్న సేవలు వివరించారు. రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయు లు, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, కోట శ్రీనివాసరావు, ఇన్చార్జి సర్పంచి యాగంటి బొల్లారావు, గొట్టిపాడు సర్పంచి ధూళిపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్‌టిఇ వివరాలు చూపుతున్న అధికారులు

దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రైవేటు యాజమాన్య పాఠశాలల పరిధిలో విద్యాహక్కు చట్టం 12 (1) సి ప్రకారం 25 శాతం సీట్ల ప్రవేశాలకు దరఖాస్తుల తుది గడువు ఆగస్టు 20 వరకు ప్రభుత్వం పొడిగించిందని ఎంఈఓ వస్రాం నాయక్ సోమవారం తెలిపారు. అర్హులైన పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. గతంలో మాదిరి కాకుండా 3 కిలోమీటర్ల పరిధిలోని విద్యార్థులకు కూడా ప్రవేశ అవకాశం కల్పించినట్లు తెలిపారు. సిఎస్‌ఈ వెబ్ సైట్ నందు ఆన్లైన్ దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎడిఎ బి ఎఫ్రాయం

డ్రోన్‌లపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నట్లు ఎఒ కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవ కేంద్రం, ఆత్మ సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ జమ కాని రైతులు ఈనెల 20లోపు ఆధార్, ఇతర బ్యాంకు సమస్యలు వెంటనే పరిష్కరించుకుని గ్రీవెన్స్‌లో ధరకాస్తు చేసుకుంటే ప్రభుత్వం తిరిగి నగదు జమ చేస్తుందని పేర్కొన్నారు. ఎడిఎ బి ఎఫ్రాయం మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతోనే అధిక ఆదాయం సాధ్యమని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ నిర్వహించారు. మండలంలో 5 కిసాన్ డ్రోన్లు రూ.39.20 లక్షల రాయితీపై అందించినట్లు తెలిపారు. డ్రోన్ పనిచేసే విధానం డ్రోగో కంపెనీ ప్రతినిధి లీలాకుమార్ వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఆత్మ ఎటిఎం కోట రామిరెడ్డి, విఎఎలు జాగర్లమూడి దినేష్ సాయి, ఎఇఒ కోటేశ్వరరావు, నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకట్రామయ్య, కామేపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

క్రీడా పురస్కారాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పురస్కారాలు అందజేస్తున్నట్లు డిఈఓ ఎస్ పురుషోత్తం సోమవారం తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన జిల్లాలోని 5 పాఠశాలలను ఎంపిక చేస్తామన్నారు. 2024-25లో స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ధృవీకరణ నకళ్ళతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) కార్యాలయంలో ఈనెల 20లోగా అందజేయాలన్నారు. నకళ్ళపై పాఠశాల హెచ్ఎం, సంబంధిత పిడి ధ్రువీకరించాలని అన్నారు. మరిన్ని వివరాలకు ఎస్‌కె కరీముల్ల 9849342566 ను సంప్రదించాలని తెలిపారు.

జమాయాత్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

జమాయాత్ ఉలేమా ఈ హింద్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక పెద్ద మసీదులో జామియత్ ఉలమా-ఎ-హింద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ముఫ్తీ అబ్దుల్లా అధ్యక్షత వహించారు. పేద, వెనుకబడిన ముస్లింల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. జామియత్ ఉలమా-ఎ-హింద్ సహాయం కోసం ఏ మతానికి చెందిన వారైనా, ఏ కులానికి చెందిన వారైనా అర్థిస్తే వారికి సహాయం అందజేస్తామని తెలిపారు. మండల నూతన కమిటి ప్రెసిడెంట్ హాఫీజ్ షేక్ మొహమ్మద్ అనస్ సూఫీ, వైస్ ప్రెసిడెంట్ హాఫీజ్ ముస్తఫా, షేక్ జిలాని, సెక్రెటరీ గాలి షరీఫ్, జాయింట్ సెక్రెటరీ షేక్ అన్సర్, షేక్ ఫక్రుద్దీన్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ సుభాని, ట్రెజరరీ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

ప్రజాశక్తి - వేటపాలెం

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులు అవగాహన కలిగివుండాలని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు డిఎస్పీ మోయిన్ సూచనలతో మండలంలోని అక్కాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శక్తి యాప్' మహిళలకు రక్షణ కవచం వంటిదని అన్నారు. మహిళలు తమ మొబైళ్లలో యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలనే ఉద్దేశంతో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యాప్‌ను ఉపయోగించే పద్ధతి వివరించారు. శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నెంబరుకు వీడియో కాల్, వాయిస్ కాల్, మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూంకు సంకేతాలు వెళతాయన్నారు. వెంటనే శక్తి బృందాలు స్పందించి సహాయం అందిస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098, 181, 1930, 1972 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం జల్లి శేఖర్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హరిబాబు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - రేపల్లె

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి పద్మావతి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాల రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు, వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఇన్ పేషెంట్ వార్డు, ఫార్మసీ గది, ప్రసూతి గది, లాబరేటరీ విభాగాన్ని తనిఖీ చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాలు, కుక్కకాటుకు సంబంధించిన రాబిస్ వ్యాక్సిన్, అవసరమైన మందుల నిల్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చిన గర్భిణీలు, బాలింతలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం భారీ వర్షాలు, వరదలు, వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల కలిగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది రోగులపట్ల అలసత్వం వహించకుండా మంచి సేవలు అందించి గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ వి సుధాకర్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ పద్మావతి

విద్యార్థినులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఎంపిడిఒ జావేద్ తన సిబ్బందితో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాల్లో 600 మంది విద్యార్థినులు ఉంటున్నారని, వారికి తగిన వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల్లో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు చెప్పారు. చదువులో వెనక పడకుండా చూడాలని అన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ మాట్లాడుతూ అవసరమైతే సమస్యల గురించి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్షిత మంచి పథకం మంచి పథకం పంప్ హౌస్ ఫిల్టర్ బెడ్లు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె శ్రీను, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు భవాని, లక్ష్మి పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల్లో పరిశీలిస్తున్న ఎంపిడిఒ జావేద్

దేవాలయాలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నియోజకవర్గంలో 11 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకం మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె రామచంద్ర మోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు మండలం తన్నీరువారిపాలెంలోని శ్రీ కోదండ రామాలయం, పోలేరమ్మ అమ్మవారి ఆలయం, నూతలపాడు శ్రీ పద్మాలంకమ్మ దేవస్థానం, యర్రంవారిపాలెంలోని విజయ గణపతి దేవస్థానం, మార్టూరు మండలం బొల్లాపల్లిలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానం, తాటివారిపాలెంలోని శ్రీ సీతా రామస్వామి దేవస్థానం, శ్రీ గోవింద మాంబ సమేత బ్రహ్మేంద్ర దేవస్థానం, ఇంకొల్లు మండలం వంకాయలపాడులోని శ్రీ పోలేరమ్మ దేవస్థానం, శ్రీ సిద్ధి వినాయక టెంపుల్, శ్రీ పుట్టల కామేశ్వరి అమ్మ వారి దేవస్థానం, సుబ్బారెడ్డిపాలెంలోని శ్రీ కోదండ రామ స్వామి దేవాలయాలకు నెలకు రూ.10వేల చొప్పున నిధులు మంజూరు చేయనుంది. అర్చకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే ఏలూరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు..

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి జెడ్‌పి హైస్కూల్లో హైదరాబాదుకు చెందిన మాంట్రుస్ ఒలింపియాడ్ అకాడమీ ప్రతినిధి వేణుబాబు 10వ తరగతి విద్యార్థులకు ఐఐటి, జెఇఇ, నీట్ ప్రవేశ పరీక్ష స్థాయిలో గణితం, సైన్స్ ఒలింపియాడ్ వారాంతపు పరీక్షలు ఆన్లైన్లో నిర్వహించారు. 10వ తరగతి గణితం, సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించి వాట్సప్ ద్వారా గుంటూరు శివశంకర్, కటకం నారాయణ జిరాక్స్ తీయించి శిక్షణ ఇచ్చారు. తల్లి, దండ్రుల ఫోన్ల ద్వారా పరీక్ష రాయించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు, మెడల్స్, నగదు బహుమతులు అందించారు. మాంట్రూస్ అకాడమీ సోమవారం గత విద్యా సంవత్సరంలో హైస్కూల్ నుండి 17 మంది ఐఐటికి ఎంపికైనందుకు హర్షం ప్రకటించారు. 596 మార్కులతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన సజ్జా దివ్యశ్రీకి పాఠశాల తరపున హెచ్ఎం తలమల దీప్తికి విడివిడిగా షీల్డులు, సర్టిఫికెట్ అందజేశారు.



ఎంపిడిఒ నేతాజిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంపిడిఒ నేతాజీకి సత్కారం

ప్రజాశక్తి - కారంచేడు

ఉత్తమ ఎంపిడిఒగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎంపిడిఒ నేతాజీని సోమవారం సత్కరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సత్కార సభలో డిప్యూటీ ఎంపిడిఒ రామ్మోహనరావు, వివిధ పంచాయతీల కార్యదర్శిలు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇరానీ టీ సెంటర్ ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఇరానీ టీ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో ఇరానీ నవాబ్ టీ సెంటర్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఇరానీ నవాబ్ టి పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జమీర్, కోదండరాం, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలి

ప్రజాశక్తి - వేమూరు

ఎన్టీఆర్ భరోసా వికలాంగుల పింఛన్లు జనవరి 2025 నుండి రీ వెరిఫికేషన్ చేస్తున్న దృష్ట్యా విలాంగ ధృవీకరణ పత్రాలను పెన్షన్ వెబ్సైటుకు అనుసంధానం చేసిందని, దీనిలో తొలగించినట్లుగా గుర్తిస్తే 30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలని శాసన సభ్యులు నక్క ఆనందబాబు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రూ.15వేల పింఛన్ పొందుతున్న వారి ఇంటింటికి వచ్చి పరిశీలిస్తారని, ఎవరికైతే 85 శాతం పైబడి వికలాంగత్వం ఉండి మంచానికే పరిమితమైనట్లు వైద్యుల బృందం గుర్తిస్తే వారికి యధావిధిగా సెప్టెంబర్ నుంచి పెన్షన్ వస్తుందన్నారు. 85శాతం కంటే తక్కువ ఉండి 40శాతం కంటే ఎక్కువ ఉంటే వారి పెన్షన్ రూ.6 వేలకు మార్పు చేస్తారని తెలిపారు. 40శాతం కంటే తక్కువగా ఉంటే 60ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలు మంజూరు చేస్తారని తెలిపారు. 40శాతం కంటే తక్కువ ఉండి 60ఏళ్లు లేకుంటే వారి పెన్షన్ సెప్టెంబర్ నుండి నిలిపేస్తారని తెలిపారు. వికలాంగ పింఛన్‌లో 40శాతం పైబడి ఉంటే యధావిధిగా రూ.6వేలు వస్తుందని తెలిపారు.

నకిలీ కాల్స్‌కు స్పందించవద్దు

ప్రజాశక్తి - చీరాల

జిల్లాలో వైద్యాధికారులు, ఐఎంఏ డైరెక్టర్లకు డిఎం అండ్ హెచ్ఒ పేరుతో నకిలీలు కొందరు సోమవారం ఫోన్లు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి పేరుతో 87902 57361 నంబర్ నుండి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. అలాంటి ఫోన్ కాల్స్‌కు డాక్టర్లు, అధికారులు ఎవ్వరూ స్పందించవద్దని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ స్పష్టం చేశారు. పొరపాటున ఫోన్ లిఫ్ట్ చేసి బెదిరింపులు ఎదురైతే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అధికారుల పేర్లను వాడుకుంటూ మోసం చేసే ఇటువంటి కాల్స్‌కి లొంగకూడదని చెప్పారు.

బంగారు కుటుంబాల ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పి4 బంగారు కుటుంబాలు ముఖ్యమంత్రితో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మంగళగిరి సీఎన్ కన్వెన్షన్ హాలులో ఎంపిక చేసిన బంగారు కుటుంబాల లబ్ధిదారు లు, వారి మార్గదర్శకులు పాల్గొంటారని తెలిపారు. మండలం నుండి ఏడు కుటుంబాలు ఎంపిక చేసినట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వల్ల వ్యాధులు ప్రబలితే

క్రిమినల్ కేసులు పెడతాం..

- మీటింగ్‌కు సమాచారం లేకుండా ఎలా వస్తారు.?
- మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలపై కలెక్టర్ ఆగ్రహం


కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వర్షాలు పడుతుండటంతో పారిశుధ్యం, తాగునీటి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ తమీమ్అన్సారియా స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంతో వ్యాధులు ప్రబలితే సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులపై కేసులు పెట్టడంతో పాటు జిల్లా స్థాయి అధికారులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌసింగ్, మెడికల్, పంచాయతీ, డ్వామా శాఖల ద్వారా చేపడుతున్న పనులు, సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా అంశాలపై కలెక్టర్ సమీక్షిస్తుండగా స్పష్టమైన సమాధానాలు చెప్పకుండా కొందరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తెల్లముఖం పెట్టడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తగిన సమాచారంతో కూడా ఎందుకు రాలేదని కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. 'మీ మండలం, మున్సిపాలిటీల పరిధిలో ఏం జరుగుతోందో, అభివద్ధి పనుల పురోగతి ఏ స్థాయిలో ఉందో కూడా మీకు అవగాహన లేదా ..! సమావేశానికి పిలిస్తే కనీసం వాటికి సంబంధించిన సమాచారం కూడా లేకుండా ఎలా వస్తారని కలెక్టర్ అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. 'బాధ్యతాయుతమైన స్థాయిలో ఉన్న మీరే ఇలా ఉంటే కింది స్థాయిలో పనిచేసే సచివాలయ సిబ్బందిని ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారో దీని బట్టే తెలుస్తోందని అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి, ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యం సరికాదని, ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రతివారం కచ్చితంగా కనీసం మూడు సచివాలయాలను సందర్శించాలని వారిని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సిఈఒ బి.చిరంజీవి, డిపిఒ గొట్టిపాటి వెంకట నాయుడు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ పాల్గొన్నారు.

2190 బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి మార్పు లేదు. ప్రతి రోజు 25 నుంచి 50 శాతం పొగాకు నో బిడ్ చెబుతున్నారు. సోమవారం నాడు 2190 బేళ్లు తిరస్కరించారు. తేలిక నేలల పరిధిలో ఉన్న కలిగిరి వేలం కేంద్రంలో బోర్డు ఇచ్చిన పరిమితి పూర్తవడంతో ఈ రోజు వేలం చేపట్టలేదు. ఈ రోజు రెండు రీజియన్స్ పరిధిలో 7710 బేళ్లు ఆక్షన్‌కి రాగా 5520 బేళ్లు అమ్ముడుపోయాయి. నల్ల రేగడి నేలల పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 4831 బేళ్ల ఆక్షన్‌కు తేగా 3700 బేళు కొనుగోలు చేశారు. ఇక్కడ 1131 బేళ్లు తిరస్కరించారు. కిలో కనిష్ఠ ధర రూ.139కు పడిపోయింది. కాగా గరిష్ట ధర రూ.282 పలికింది.

ఆకట్టుకున్న పుస్తక మహోత్సవం


పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు పుస్తక మహోత్సవం నాల్గవ రోజు విద్య, కళ, విజ్ఞానం సమన్వయంతో పుస్తకాల ప్రాధాన్యాన్ని ప్రతిఫలింపజేసింది. సోమవారం జరిగిన బుక్ ఫెస్ట్ గ్రౌండ్స్ పలు కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. ఉదయం నుంచే మూడు పాఠశాలల విద్యార్థులు బుక్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని సందర్శించారు. మధ్యాహ్నం నుంచి మట్టి బొమ్మల తయారీ వర్క్‌షాప్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దాదాపు 70 మంది విద్యార్థులు మట్టితో బొమ్మలు, ఆట వస్తువులు రూపొందించి తమ ప్రతిభను ఆవిష్కరించారు. సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర ప్రచురణల ఆధ్వర్యంలో పుస్తకావిష్క రణ జరిగింది. మహీధర నళినీమోహన్ రచించిన 'రాకెట్ కథ', 'నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ వేడుకకు సీనియర్ ఐఎఎస్ అధికారి హరి నారాయణ చక్రవర్తి అధ్యక్షత వహించారు.

విద్యార్థుల్లో విజ్ఞాన స్ఫూర్తి..

విద్యార్థులు పుస్తక ప్రదర్శనను వీక్షించి సైన్స్ కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి మెజీషియన్ రామన్ మనుమరాండ్రు (చిన్నారులు) బలిజెపల్లి ధైర్య, దశ్య గాజుపెంకుల పై నడక పట్ల ఆసక్తి చూపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


గాజు పెంకులపై నడుస్తున్న చిన్నారులు